క్లుప్తంగా

సత్తెమ్మతల్లికి విశేష పూజలు



సత్తెమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి సత్తెమ్మతల్లికి ఆదివారం భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. మహిళలు పసుపునీళ్లను బిందెలతో తీసుకొచ్చి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. పసుపుకుంకుమలు సమర్పించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా పైడితల్లమ్మ తీర్థం



పైడితల్లి అమ్మవారు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు అమ్మవారిని దర్శించుకున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డులోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ ముమ్మన దేముడు తెలిపారు. చీమలాపల్లిలో రోడ్డు పనులను ఆదివారం కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్ ఎ.యర్రయ్య, కె. సంతోష్, దువ్వి అప్పారావు, యల్లపు సరదేశినాయుడు, బొట్ట రాజేష్ కుమార్, ఎ.శివ, టైల్స్ రాజు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం నేడు

పెందుర్తి: జీవీఎంసీ 96వ వార్డు నల్లక్వారీ కాలనీలో వెంజేసిన శ్రీ ఉమా సహిత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం విశేషంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. అలాగే ఈనెల 6వతేదీన వినాయకస్వామి తీర్థమహోత్సవం నిర్వహిస్తున్నట్టు కమిటీ పేర్కొంది. భక్తులు ఈకార్యక్రమాల్లో పాల్గొని స్వామి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

టీటీడీ ఆధ్వర్యంలో చతుర్వేద పారాయణం



అభయాంజనేయ స్వామి ఆలయంలో చతుర్వేద పారాయణం చేస్తున్న టీటీడీ వేద పండితులు

సీతమ్మధార: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం టీటీడీ వేద పండితులు సీతమ్మధార ఏఎస్సార్ నగర్ కొండపై గల 108 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో చతుర్వేద పారాయణం నిర్వహించారు. ఈ నెల 5, 6 తేదీల్లో సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. టీటీడీ సూపర్‌వైజర్ గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనాపాఠి పాల్గొని మాట్లాడుతూ వేదపారాయణం లోకశ్రేయస్సును కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఏఎస్ఎన్ రాజు, అర్చకుడు అనిరుథ్, భక్తులు పాల్గొన్నారు.

రూ. 3.03 కోట్లతో అభివృద్ధి పనులు

- అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- సచివాలయ, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకేల ప్రారంభం



తానాంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



వెన్నలపాలెంలో అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



కలపాకలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ.3.03 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ముందుగా తానాం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా రాజకీయాలకు అతీతంగా సంక్షమ పథకాలు అమలు చేస్తుందన్నారు. అవినీతి లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా వారి లబ్ధిని అందిస్తుందని చెప్పారు. ప్రతీ గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఒక్కో గ్రామ సచివాలయం పరిధిలో ప్రజలకు సుమారు రూ.15 కోట్ల మేర పథకాల రూపంలో ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రజలకు చేరువలోనే వైద్య సేవలు అందుతున్నాయన్నారు. నాడు–నేడులో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత జగనన్న ప్రభుత్వానిదేనన్నారు. ఎన్ని పార్టీలు, ఎందరు నాయకులు కలిసినా ప్రజలు మాత్రం జగనన్న వెంటే ఉన్నారని... అఖండ మెజార్టీతో జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్య మంత్రి కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలోఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, ఎంపీడీవో కీర్తి స్పందన, పంచాయతీరాజ్ డీఈ సత్యనారాయణమూర్తి, ఏఈ జి.రామారావు, హౌసింగ్ ఏఈ ఎం.ఎస్.ఎన్.రెడ్డి, మండల వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి, సర్పంచులు వెన్నల అప్పారావు, కూండ్రపు వరలక్ష్మిసీతారామయ్య, బొండా కనకారావు, పార్టీ నాయకులు బండారు రామారావు, బొంది అచ్చిబాబు, బొద్దపు చిన్నారావు, కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు ఇవీ

- పరవాడలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం–1 ప్రారంభించారు.
- వెన్నలపాలెంలో ఎన్టీపీసీ, గ్రామ పంచాయతీ సంయుక్తంగా రూ.26 లక్షలతో నిర్మించిన రక్షణ గోడ, రూ. 20.80 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్‌క్లినిక్ భవనాలను ప్రారంభించారు.
- కలపాకలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని అదుబాటులోకి తెచ్చారు.
- నాయుడుపాలెంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనం,రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లీనిక్ భవనాలను ప్రారంభించారు.
- రావాడ శివారు గొల్లగుంటలో రూ.10 లక్షలతో ఏర్పాటు ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలు, ఎన్టీపీసీ నిధులు రూ.16.25 లక్షలతో చేపట్టిన కొనప్ప చెరువు ఆధునీకరణ పనులు, గొల్లగుంటలో రూ.12 లక్షలతో నిర్మించిన నూతన తరగతి గదులు, రావాడలో రూ.10 లక్షలతో నిర్మించిన మంచినీటి పథకాన్ని అందుబాటులోకి తెచ్చారు.
- మోటూరువానిపాలెంలో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా రూ.14 లక్షలతో నిర్మించిన కుళాయిలతో పాటు రూ.11.50 లక్షలతో నిర్మించిన మంచినీటి పథకాలను ప్రారంభించారు.

రక్షిత మంచినీటి ట్యాంకుల పరిశీలన



శిథిలావస్థలో ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకులను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ రాజశేఖర్ తదితరులు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న రక్షిత మంచినీటి పథక ట్యాంకులను ఆంధ్రా విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ రాజశేఖర్ ఆదివారం పరిశీలించారు. బంగారమ్మపాలెంలో శిథిలావస్థకు చేరిన 10 వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్‌ను,అంతకాపల్లిలోని 60 వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకును ఆయన పరిశీలించి సౌండ్‌నెస్ టెస్టు చేశారు.

ఈ ట్యాంకులను మరమ్మతులు నిర్వహించి వినియోగించవచ్చా.. పూర్తిగా తొలగించాలా అన్నది టెస్టులు అనంతరం నిర్ధారించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు, గ్రామ పెద్దలు దాడి కన్నం నాయుడు, దొడ్డి వీర అప్పారావు,దొడ్డి సూరి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ,ఇంజినీరింగ్ అసిస్టెంట్ రూప ఉన్నారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి

ఎస్టీయూ జిల్లా కార్యదర్శి పైడిరాజు



రాజారావును సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

విశాఖ విద్య: ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా మారాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సౌత్ ఇండియా స్థాయి సైన్సు ఫెయిర్‌లో ఉపాధ్యాయ కేటగిరీలో రాష్ట్రం నుంచి మొదటి బహుమతి సాధించిన జిల్లాలోని గంగవరం జెడ్పీ హైస్కూల్ సైన్సు ఉపాధ్యాయుడు పి. రాజారావును ఘనంగా సన్మానించారు. సైన్సు పరిశోధనల్లో విద్యార్థులను ప్రోత్సహించడమే కాకుండా, నిత్య విద్యార్థిలా సరికొత్త ప్రయోగాలు చేయడం గొప్ప విషయమన్నారు. ఇతర ఉపాధ్యాయులకు రాజారావు మాస్టారు కృషి స్ఫూర్తిదాయకమని అభినందించారు.

జిల్లా కార్యదర్శిగా పైడిరాజు

ఎస్టీయూ కౌన్సిల్ సమావేశంలో జిల్లా కార్యదర్శిగా అడవరం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగుతున్న పైడిరాజు సేవలు జిల్లాలో మరింత వినియోగించుకునేలా కీలకమైన కార్యదర్శి పోస్టులో ఎంపిక చేశారు.

కరాటేలో విద్యార్థులకు పతకాలు



సర్టిఫికెట్లు అందుకుంటున్న మౌంట్ డియోస్ విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కోచ్ పుష్పారావు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు అడవివరంలోని మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో సత్తా చాటారు. కూర్మన్నపాలెంలో అకాడమీ ఆఫ్ షిటోరుయ్ కరాటే డూ ఇండియా(ఆస్కీ) ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బెల్ట్ గ్రేడింగ్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు హాజరయ్యారు. బెల్ట్ గ్రేడింలో వామప్స్, సీటప్స్, పంచెస్, బ్లాక్స్, కిక్స్, స్టాండ్స్, కటస్ పరీక్షల్లో విద్యార్థులు శ్రీల, లీలా వైష్ణవి, లాలిత్య, దేవకి, ప్రణతి ఎల్లో బెల్ట్ సాధించారు. వీరికి నిర్వాహకులు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులను మౌంట్ డియోస్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షురాలు, ఆర్‌టీఐ మాజీ కమిషనర్ ఎం.విజయనిర్మల, సొసైటీ సెక్రటరీ ముత్తంశెట్టి కృష్ణారావు, సీఈవో ముత్తంశెట్టి అఖిల, ప్రిన్సిపాల్ ఎవ. భార్గవి నాయక్ అభినందించారు.

కరాటేలో పతకాలు

పరవాడ: విశాఖలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొన్న సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్‌కు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారు. దీపాంజలినగర్ నుంచి 5 గురు విద్యార్థులు రెండు విభాగాల్లో పాల్గొన్నారు. సమీక్షా సాహూ బంగారు, వెండి పతకాలను సొంతం చేసుకున్నాడు. టి.భవ్యశ్రీ వెండి, రాగి పతకాలు సాధించింది. అశ్విని అనీష్ రెండు కాంస్య పతకాలు, ఎస్.సాయినారాయణ కాంస్య పతకం సాధించారని కోచ్ గొర్లి పుష్పారావు చెప్పారు. ఈ పోటీలకు రిఫరీలు, జడ్జిలుగా జి.పుష్పారావు, గొర్లి వంశీ, ఎం.తులసీరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కోచ్ అభినందించారు.

దేశ, విదేశాల్లో బ్రహ్మకుమారీస్ సేవలు



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో దేశ, విదేశాల్లో రాజయోగ అభ్యాస కార్యక్రమం కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి సుధా తెలిపారు. రైల్వేస్టేషన్ సమీపంలోని రాయల్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన నమస్కారం మన సంస్కృతి–మన సంప్రదాయం ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. మన దేశంలో 56 ఏళ్లుగా, రష్యాలో 36 ఏళ్లుగా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, రాజయోగ అభ్యాసం గురించి తెలియజేస్తున్నామన్నారు. రాజయోగ అభ్యాసం నేర్పించడం ద్వారా రష్యాకు చెందిన సుమారు 2వేల మంది యువతీ యువకులు ప్రతి రోజూ సత్సంగం వంటి సంపూర్ణ సాత్వికాహారులుగా మారారని తెలిపారు. దేశవిదేశాల నుంచి వచ్చిన అతిథుల చేతుల మీదుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంనతరం నమస్తే ప్రాజెక్టు లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజయోగిని బి.కె.సుధా, బి.కె.ఇరీనా, బి.కె.విక్టోరియా, బి.కె.రూప, రైల్వే న్యూకాలనీ ఇన్‌చార్జి శశికళ, లైట్ హౌస్ అండ్ లైట్ షిప్స్, విశాఖపట్నం ముఖేష్ ఫార్మ, ఐఆర్ఎస్ అడిషనల్ కమిషనర్(జీఎస్టీ) ఎం.శ్రీకాంత్, జరీనా అరవింద్ గోష్, విశాఖ, విజయనగరం, అల్లూరి, మన్యం జిల్లాల నుంచి సుమారు 400 మంది బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో మహాశాంతి యజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న వాసుపల్లి జానకీరామ్

మహారాణిపేట : గత ఏడాది నవంబర్ 19వ తేదీన విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సంభవించిన అగ్నిప్రమాదం మత్స్య పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపింది. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కానీ ఈ ఘటన జరిగిన తర్వాత చేపల వేట తగ్గుముఖం పట్టింది. హార్బర్‌ను కాపాడాలని కోరుతూ గంగాదేవి ఆశీస్సుల కోసం ఈరోజు నుంచి మూడు రోజుల పాటు ఫిషింగ్ హార్బర్‌లో శ్రీ జటా రుద్ర రాజశ్యామల జటా గంగేశ్వర మహా శాంతి యజ్ఞం ప్రారంభించారు. ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఆధ్వర్యంలో ఘనంగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

పరవాడ తహసీల్దార్ గణపతిరావు బాధ్యతల స్వీకరణ



పరవాడ: తహసీల్దార్‌గా ఎస్.గణపతిరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస నుంచి గణపతిరావు ఇక్కడికి వచ్చారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన కనకారావును శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. కొత్త తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దారు శాంతిభూషణరావు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఫ్లైయాష్ లారీల అడ్డగింత



నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు

సబ్బవరం: మండలంలోని అసకపల్లి–లంకెలపాలెం ప్రధాన రహదారిలో నిబంధనలు పాటించకుండా బొగ్గు,తడి ఫ్లైయాష్ తరలించడంతో ఇబ్బందులు పడుతున్నామని పైడవాడ అగ్రహారం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో బొగ్గు,తడి ఫ్లైయాష్ తరలిస్తున్న వాహనాలను ఆదివారం నిలుపుదల చేసి గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా తడి ఫ్లైయాష్ వాహనాలు నడపడంతో రోడ్డును ఆనుకొని ఉన్న గ్రామాలపై ఫ్లైయాష్, బొగ్గు నుంచి వచ్చే దుమ్ము కమ్మేసి కాలుష్యం కోరల్లో గ్రామాలు చిక్కుకుంటున్నాయని వాపోయారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌తో పాటు ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు. గొంతిన పైడిరాజు, దురిగినాయుడుతో పాటు అధిక సంఖ్యలో గ్రామస్తులు నిరసనలో పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

దాబాగార్డెన్స్ : ప్రముఖ సాంస్కృతిక సంగీత సేవా సంస్థ మెలోడీ క్రియేటర్స్‌చే ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. చందురుని మించు అందమొలికించు పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కొణతాల రాజు, సత్యనారాయణ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ప్రసాద్, మస్తాన్‌రెడ్డి, వర్రె నాంచారయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నగరానికి చెందిన సీనియర్ గాయకుడు పి. రాము అలనాటి తెలుగు చలన చిత్రాల్లోని పలు సినీ గీతాలను సహచర గాయనీ గాయకులతో మధురంగా ఆలపించారు.

ప్లాస్టిక్ నిషేధిస్తే మంచి వాతావరణం



సమావేశంలో పాల్గొన్న రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు మోడీ వీధిలో ఆదివారం ప్లాస్టిక్ నిషేధం, తడి-పొడి చెత్త నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జోన్ పరిధిలోని 19 సంఘాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. సామాజిక సమస్యలపై వివరణాత్మక చర్చ నిర్వహించారు. ముఖ్యంగా ప్లాస్టిక్‌ను అన్ని కాలనీల్లో నిషేధించాలని సూచించారు. అలాగే తడి-పొడి చెత్తను వేరు చేసి ఇంటికి వచ్చే శానిటేషన్ సిబ్బందికి అందించాలని ప్రతిజ్ఞ పూనారు. కాలనీల్లో ఎలాంటి సమస్య వచ్చినా అందరు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్, అసోసియేట్ అధ్యక్షుడు కె.ఎస్.ఆర్ మూర్తి, జనరల్ సెక్రటరీ దుర్గాప్రసాద్, మోడీ వీధి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు సూరపరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం. రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు రక్షణ గోడ నిర్మించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న గొల్లగుంట ముస్లింలు

పరవాడ: గొల్లగుంట గ్రామంలో ముస్లింలకు చెందిన శ్మశాన వాటికకు రక్షణ గోడ నిర్మించాలని గ్రామ ముస్లింలు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను కోరారు. రావాడ శివారు గొల్లగుంటలో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేకు వారు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ముస్లింలు కోసం కేటాయించిన శ్మశాన వాటికను కొందరు ఆక్రమించాలని ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. శ్మశానవాటిక స్థలం అచ్యుతాపురం మండల పరిధిలో ఉందని.. అక్కడి ఎమ్మెల్యే కన్నబాబు రాజుతో మాట్లాడి రక్షణ గోడ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కలిసిన వారిలో సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, నాయకులు పల్లా గోవిందు తదితరులు ఉన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకుడు రఘునాథ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

సంస్కృతి పరిరక్షణకు సహకారం



మేళాను ప్రారంభిస్తున్న రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రేమ్ ప్రకాష్



దివ్యాంగులకు సైకిళ్లను బహూకరిస్తున్న అతిథులు

దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా

పరవాడ: భారతీయ వారసత్వం, సంస్కృతిని ప్రోత్సహించడం, సమాజ ఉద్ధరణ కోసం సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని దీపాంజలినగర్ దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా అన్నారు. దీపాంజలినగర్ సాధన క్రీడా మైదానంలో లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆనంద్ మేళాను రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెస్ట్–1 ప్రేమ్ ప్రకాష్ ప్రారంభించారు. కార్యక్రమంలో సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా, దక్షిణ దీపాంజలి సమితి మీను బాత్రా పాల్గొన్నారు. దీపాంజలినగర్ దీపికా లేడిస్ క్లబ్ అధ్యక్షురాలు అంజు మహిళా సాధికారిత దిశగా చేపట్టిన సీఎస్సార్ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు సైకిళ్లు అందించారు. దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటాం

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అనే నినాదంలో ఉద్యమ ఫలితంగా ఏర్పడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 1,088వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో ఆదివారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్యమానికి అంతా మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.